**కథ**

# పాపం కొద్దీ ప్రమోషను!

''ఇక మంచితనంగా వుండటం తన వల్ల కాదు. ఎలాగైనా చెడిపోవాలి.'' విమల గట్టిగా నిశ్చయించుకుంది.

''జీవితంలో పైకి రావడమెలా? చక్కటి వ్యక్తిత్వం తెచ్చుకోవడమెలా? లాంటి టైటిల్స్‌తో రకరకాల పుస్తకాలు మార్కెట్ లోకి వచ్చాయి. చదివి ఎంతమంది బాగుపడ్డారో అది వేరే సంగతి! అలాగే 'చెడిపోవడమెలా?' అన్న టాపిక్‌మీద కూడా ఏ రచయితో పూనుకుని ఓ పుస్తకం రాసి పుణ్యం కట్టుకోలేదు. రాసుంటే, ఇప్పుడు తనకి ఇన్ని తిప్పలుండకపోను.'' నిట్టూరుస్తూ అనుకుంది విమల.

''ఏంటండీ..ఫైల్ ముందేసుకుని ఆలోచనలో పడ్డారు? కేష్ టాలీ కావడం లేదా?'' పలకరించాడు వెంకటేశ్వర్రావు.

విమల చప్పున తేరుకుని పక్క సీటు వైపు చూసింది.

''తన పనేదో తను చూసుకోక, మధ్యలో ఈ సంగతెందుకో..'' లోలోపలే తిట్టుకుంది.

''అబ్బే. అలాంటిదేమీ లేదండి..'' మీ పని మీరు చూసుకోండి. అన్న అర్థం వచ్చేట్టు, సీరియస్‌గా అతని వైపు చూస్తూ చెప్పింది విమల.

వెంకటేశ్వర్రావు, ఆమె సమాధానానికి ఏడవలేక ఓ నవ్వు నవ్వి, తన ఫైల్లోకి తల దూర్చాడు.

''ఎంత సేపటికీ ఆడవాళ్ళతో మాటలు కలపడానికే ప్రయత్నిస్తారు..ఇడియట్స్..'' తిట్టుకుంటూ ఫైల్ మూసేసింది విమల.

ఎడం చేతికున్న రిస్ట్‌వాచ్ వైపు చూసింది. 'అబ్బా..ఇంకా మూడు గంటలేనా? ఆఫీసు నుంచి బయట పడాలంటే ఇంకో రెండు గంటలు గడవాలి..' విసుగ్గా అనుకుంది విమల.

సాధారణంగా తన వర్క్ మధ్యాహ్నానికే అయిపోతుంది. మెల్లగా నానుస్తూ చెయ్యడం, వర్క్‌ని పెండింగ్‌లో పెట్టడం తనకలవాటు లేదు. వర్క్ అయిపోయింది కాబట్టి వెళ్ళిపోదామా అంటే వీళ్ళంతా ఏడుస్తారు. వీళ్ళలాగా తనూ మెల్లగా పని చేసుకుంటే పోలా..

''ఏంటి విమలా..అప్పుడే పనయిపోయిందా?'' సీనియర్ క్లర్కు వరలక్ష్మి నవ్వుతూ అడిగింది.

''అవును..ఇంటికి వెళ్ళిపోదామంటే ఇంకా మూడే అయింది..'' కాస్త విసుగ్గా అంది విమల.

''నాకు చిన్న షాపింగ్ పని వుంది. వస్తావా? ఇంకో గంటాగి వెళ్దాం..'' అడిగింది వరలక్ష్మి.

''ఈరోజా..? కుదరదు లక్ష్మీ! ఇంట్లో కాస్త పనివుంది. నేను త్వరగా ఇంటికి వెళ్ళాలి. సారీ..'' మొహమాటంగానే చెప్పింది విమల.

''ఫర్వాలేదులే..శ్యామల వస్తుందేమో..తను తీసుకెళ్తాను'' తన సీట్లోకి వెళ్ళిపోతూ అంది వరలక్ష్మి.

షాపింగులకెళ్ళడానికి వీళ్ళకెంత ఓపికో! ముద్దనగా పిల్లల్ని వదిలి వస్తారు. ఎప్పుడెప్పుడు ఇంటికెళ్ళిపడదామా అని అనిపించదేమో..అయినా తనకున్నంత బరువుబాధ్యతలు వీళ్ళకెవరికున్నాయని..తన విషయమే మరీ దారుణం. నెత్తిమీద పడ్డ బరువు బాధ్యతలను మోయలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ, ఈమధ్య వింత వింత ఆలోచనలొస్తున్నాయి.

అసలు తను ఇంత మంచితనంగా ఎందుకుండాలి? ఎవరిని ఉద్ధరించాలని..చెడిపోతే పోలా? అసలు చెడడం అంటే ఏవిటి? చెడిపోవడమంటే ఎలా?

విమలకి ఎందుకో నవ్వొచ్చింది.

''ఏంటి విమలగారూ! మీలో మీరే నవ్వుకుంటున్నారు. మాకూ చెబితే మేమూ నవ్వుతాం కదా..'' హెడ్ క్లర్కు అరుణాచలం తన సోడా బుడ్డి కళ్ళద్దాల్లోంచి విమలని గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

విమలకి ఒళ్ళు మండింది. నవ్వితే ఎందుకు నవ్వావని, తుమ్మితే ఎందుకు తుమ్మావని వెధవ ప్రశ్నలూ వీళ్ళూనూ..

''వర్కింగ్ అవర్స్‌లో జోకులు. నవ్వులు ఏంటండి, స్కూలు పిల్లల్లాగా..'' వినయంగానే చురకంటించింది విమల.

''మీరు భలే జోకులేస్తారండి..'' ఏం ఎరగనట్టు పెద్దగా నవ్వాడు అరుణాచలం.

'నా అంత కూతుళ్ళున్నారు. అయినా ఆడపిల్లలతో వెధవ జోకులూ నువ్వూనూ..' తిట్టుకుంది విమల!

'తన మానాన తను ఏదో ఆలోచించుకుంటుంటే..మధ్య మధ్యలో వీళ్ళగోలొకటి.' అనుకుంటూ తిరిగి తన ఆలోచనల్లో పడిపోయింది విమల.

కొన్ని రోజులుగా తీవ్రంగా ఆలోచిస్తున్నా, చెడిపోవడమెలాగో తెలియడం లేదు.

''చెడు అలవాట్లు అనగా నేమి?'' మనసులోనే తనని తాను ప్రశ్నించుకుంది విమల.

సిగరెట్లు, తాగుడు, పేకాట, రేసులు...వగైరాలు చెడు అలవాట్లయితే, వీటిలో ఏ ఒక్కటైనా తను అలవాటు చేసుకోగలదా?

అసంభవం...

తన వల్ల కాదు..ఇక మిగిలింది..తిరుగుడు.

ఇది మాత్రం ఎలా? తనకొక్క బాయ్ ఫ్రెండైనా లేడే...

''లేకపోతేనేంలే..ఇప్పుడు కొత్తగా పరిచయం చేసుకుంటే పోలా..'' సమస్య ఒక కొలిక్కి వచ్చినట్టుగా విమల మనసు తేలికపడింది.

ఇప్పుడు కొత్తగా ఎవరిని పరిచయం చేసుకోవాలి? 'నిన్నేగానీ పరుల నెరుంగ..' టైపులో ఇన్నాళ్ళూ బ్రతికింది తనూ (దాన్ని తన పతిదేవుడు గుర్తించకపోతే గుర్తించకపోవుగాక..!) ఇప్పుడు కొత్తగా బాయ్‌ఫ్రెండు దొరికేదెలా చెప్మా!

తన ఆఫీసులో వాళ్ళనే ఎవరినైనా ఎంచుకుంటేనో..

విమల ఆఫీసంతా ఓసారి పరికించి చూసింది. అరుణాచలం, వెంకటేశ్వర్రావు, సుబ్రమణ్యం, మూర్తి, రామశర్మ..వీళ్ళని చూస్తేనే తనకి మాట్లాడాలని పించదు..అవసరమైనప్పుడు తప్ప, వాళ్ళతో మాట్లాడనే మాట్లాడదు. ఇక వాళ్ళతో ఫ్రెండ్‌షిప్పు-తిరుగుళ్ళూ కూడానా..ఇంపాజిబుల్!

మరెలా?

ఆలోచిస్తూనే టైము చూసింది విమల.

ఐదు కావస్తోంది. ''హమ్మయ్య. ఇక దుకాణం కట్టెయ్యవచ్చు..'' అనుకుంటూనే విమల అన్నీ సర్దేసి, బ్యాగ్ అందుకుని, ఆఫీసులోంచి బైటపడింది.

బస్ స్టాప్‌లో జనాన్ని చూసేసరికి ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది విమలకి.

''ఆటోలో వెళ్దామా అంటే అనవసరంగా నలభై రూపాయలు దండగ. ఎంత సేపైనా ఇలా నిలబడక తప్పదు..'' అనుకుంటూ బస్టాప్‌లో ఓ పక్కగా వెళ్ళి నిలబడింది.

ఇంటికెళ్ళాకే చెయ్యాల్సిన పన్లు గుర్తొచ్చాయి. సింకు నిండా అంట్లు, వంట, .పిల్లల చదువులు..ఒక్క క్షణం ఎటైనా పారిపోదామా అనిపించింది విమలకి.

''ఎక్కడికని పారిపోగలదు. బంధాలు కాళ్ళకి సంకెళ్ళయ్యాక..'' విమల నిర్లిప్తంగా నవ్వుకుంది.

పెళ్ళయ్యాక జీవితం ఇంత దారుణంగా వుంటుందా? ఈ వాస్తవం తనకి ముందే తెలిసుంటే? అదెలా సాధ్యం..దిగాకే కదా లోతు తెలిసేది.

సంపాదించే పని, ఇంట్లోకి సరుకులు తెచ్చే పని, వంట పని, కడుగుడు, ఉతుకుడు, పిల్లల పన్లు..మొదలైనవన్నీ ఒక్క మనిషి నెత్తిమీద పడితే, ఆ మనిషి మనస్థితి ఎలా వుంటుంది? ఎవరి ఊహకైనా అందుతుందా..!

ఇన్నాళ్ళూ ఆవేదన అంచుల్లోనే ఆనందాన్ని వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడో? భరించలేకపోతోంది.

అవును మరి. సహనానికైనా, స్థైర్యానికైనా ఓ హద్దంటూ వుంటుంది కదా! ఒక మనిషి బాధల ప్రవాహానికి ఎంతకాలం ఒంటరిగా ఎదురీదగలదు?

''ఏవిటో ఈ ఆలోచనలు తనని చెదపురుగుల్లా పట్టి తినేస్తున్నాయి..'' అనుకుంటూ బస్టాప్ మొత్తం కలియచూ

సింది విమల. తన ఆలోచనల మధ్య తనుండి గవ ంచలే దుగానీ, మగ కీటకాలు కొన్ని తననే గుచ్చి గుచ్చి చూస్తు న్నాయి.

చిరాగ్గా చూపులు తిప్పుకుంది విమల. ''వీళ్ళ చూపు లకే నేనింత చిరాకుపడి పోతే..ఇక వీళ్ళతో స్నే మెలా చేస్తాను..నా తలకాయ్..''

''మీరింకా ఇక్కడే వున్నారా?''

విమల ఉలికిపాటుగా తలపక్కకి తిప్పి చ ంది. కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చిన సుబ్రమణ్యం..తనకి డడు గుల దూరంలో నిలబడి వున్నాడు.

''ఇంకా బస్సు రాలేదు..'' కాస్త పక్కకి జ తూ చెప్పింది విమల.

''ఎక్కడ మీరుండేది?'' అడిగాడు.

''చిక్కడపల్లి'' విమల ముభావంగా చెప్పింది.

''అరె.. మా ఇంటికి దగ్గరేనే..'' ఆనందంగా న్నాడ తను.

'ఏడవలేకపోయావు. వెధవ ఆనందం ను మా. ఎంత ఒకే ఆఫీసులో పని చేస్తే మాత్రం ఇలా బస్టాం డుల్లో మాటలు కలపాలా'..విమల మనసులోనే తిట్టుకుంది.

''మీ వారెక్కడ చేస్తారు?'' మళ్ళీ అతనే అడిగాడు.

'వెధవ ప్రశ్నలూ వీడూనూ-' నిశ్శ బ్దంగా గొణుక్కుంది విమల.

కానీ సమాధానం చెప్పడానికి గొంతు పెగిలితే కదా..! ఈ ప్రశ్నకి జవాబు చెప్ప డానికి తన దగ్గర సమాధానం వుండదు. తప్పనిసరిగా అబద్ధం చెప్పాల్సి వస్తుంది. అబద్ధాలాడకూడదని ఉగ్గుపాలతో నేర్చు కున్న సంప్రదాయమే, అబద్ధాలు నేర్పు తోంది. ఎంత ట్రాజెడి!

పెళ్ళంటేనే ఒక అబద్ధమా?

అంతే కాబోలు!

''మా ఆయన ఏమీ చేయడు..సంపాదించడ బాధ్య తలు పట్టవు..'' అని నిజం చెబితే, ఇక వీళ్ళ ప్రవ ఎలా వుంటుంది? భరించ శక్యమా..?

కొన్ని సందర్భాల్లో అబద్ధాలాడ్డం తప్పనిసరి!

''నాదీ అదే రూటు కదా..రండి డ్రాప్ చే ను..'' విశాల హృదయంతో పిలిచాడతను.

''నో థాంక్స్! మా బస్సు వచ్చేస్తుంది..'' విమ కాస్త పదునుగా చెప్పింది.

విమల చూపుల్లో కనిపిస్తున్న వాడికి అతను మ అన లేక, ''ఓకే వస్తాను'' అనేసి వెళ్ళిపోయాడు.

'ఇలా మగాళ్ళందరి మీదా అయిష్టతే కలిగి ఎలా? తను ఎవరితో స్నేహం చేయాలి? ఎవరితో తిరగా ఎలా చెడిపోవాలి...?'

ఇందాకటి నుండీ తన ఆలోచనల్లో తనుండి నించ లేదుగానీ, తనకి నాలుగడుగుల దూరంలోనే ఒక నిల బడి బస్ కోసం వెయిట్ చేస్తున్నాడు. అందరిలా తినే సేలా చూడ్డం లేదు. కాస్త డీసెంట్‌గా, మర్యాదగా కనబ



డుతున్నాడు. ఇతనితో ఫ్రెండ్‌షిప్ చేస్తేనో.

అతను హఠాత్తుగా తల తిప్పి విమల వైపు చూశాడు. అతన్నే చూస్తున్న విమల కంగారుపడి చూపులు పక్కకు తిప్పుకుంది. అంత వరకూ బుద్ధిగా వున్నతను, విమలనే ఆసక్తిగా చూడ్డం మొదలుపెట్టాడు.

**వి.ఎస్.**

'అనవసరంగా అతనివైపే చూసి బుద్ధితక్కువ పని చేసానే..' అనుకుంటూ విమల కాస్త వెనక్కి జరిగింది.

''ఇదేమిటి? మగవాళ్ళ చూపులే తనకి చిరాకు కలి గిస్తే..ఇక ఒక మగవాడితో స్నేహం చేసి చెడిపోవడమెలా?'' నిస్సహాయంగా అనుకుంది విమల.

''అసలు చెడిపోవడమెందుకటా?'' అంతరాత్మ ప్రశ్నించింది.

''నా మంచితనాన్ని ఎవరూ గుర్తించలేదు కాబట్టి..నా

మంచితనానికి విలువేలేదు కాబట్టి..మంచితనా  అసలు ఫలితమే లేదు కాబట్టి..''

నిజంగా తన మంచితనాన్ని ఎవరు గుర్తించ  ?!

అత్తమామలా? కన్నవాళ్ళా? అక్కచెల్లెళ్ళా  చివరికి కట్టుకున్న వాడితో సహా ఎవరు గుర్తించారు? కన్నీ  వరదలో ఉక్కిరిబిక్కిరవుతూ కూడా..తను ఎంచుకున్న ప  ాకి ఒక్క చిన్న గుర్తింపు వుందా? ఎవరి నోటనైనా ఒక్క  మ్పుకోలు మాట వుందా? చిన్న ప్రశంసైనా వుందా?

కష్టకాలంలో వున్న మనిషికి ఒక చిన్న ప్ర  స, కాస్త గుర్తింపు, వెయ్యి ఏనుగుల బలాన్నిస్తాయని  డా తెలియని పిచ్చివాళ్ళా?- అజ్ఞానులా ఈ మనుషుల  ?

తను ఎక్కవలసిన బస్సు రావడంతో,  చనలకి తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పెట్టింది విమల!

★★★

హడావుడిగా గేటు తీస్తూ టైము చూసింది  ల.

''అబ్బ..అప్పుడే  ఆరున్నర..గబగబ  వంట చేయాలి..'' అనుకుంటూ లోపలికొచ్చింది.

చదువుతల తల్లి ఇంట్లోనే కొలువు తీరినట్లు  లిద్దరూ శ్రద్ధగా చదువుకుంటున్నారు. తల్లిని చూడ  వాళ్ళ కళ్ళల్లో వెలుగొచ్చింది. విమల చెప్పులు విప్పి,  ఇద్దరి మధ్యా కూర్చుంది. ఆఫీసు నుంచి ఎంత  సిపోయి వచ్చినా, ఎంత ఆలస్యంగా వచ్చినా వస్తూనే, కాసే  వాళ్ళతో గడపడం, ఆమెకిష్టమైన దినచర్య!

''స్కూలు నుండి రాగానే ఏదైనా తిన్నారా  ఆప్యాయంగా చూస్తూ అడిగింది.

''బిస్కెట్లు తప్ప ఏవీ లేవమ్మా తినడానికి.  అంది పాప.

''అవే తిన్నాం లేమ్మా-'' చెప్పాడు బాబు.

''అయ్యో..ముందే నాకు చెప్పలేదేం నా  ? రేపు కొనుక్కొస్తాలే- యూనిట్ టెస్ట్‌లు బాగా రాశారా  పాపని ఒళ్ళో కూర్చోబెట్టుకుంటూ అడిగింది విమల.

''ఓ బాగా రాసాను. మళ్ళీ ఫస్ట్ ర్యాంక్ నాదే ''

''నాక్కూడా ఫస్ట్ ర్యాంకే వస్తుంది.''

ఇద్దరూ కోరస్‌గా చెప్పారు.

''తనకి మిగిలిన అదృష్టం ఇదొక్కటే! పి  ిద్దరూ చక్కగా చదువుకుంటున్నారు'' తృప్తిగా అనుకుం  విమల.

''వుండండి. గబగబా వంట చేసేస్తాను. సా  ంత్రం మీరు సరిగా తినలేదు కదా..ఆకలి వెయ్యడం  మా?'' లేస్తూ అడిగింది విమల!

''వేస్తోందమ్మా..'' పాప చెప్పే తీరుకు కడుపు తరుక్కుపోయింది విమలకి!

''అరగంటలో అన్నం పెట్టేస్తాను నాన్నా..'' అంటూనే విమల గబగబా కిచెన్ లోకి నడిచింది.

★★★

''పదకొండు కావస్తోంది..మీ జనకుడికి ఇంకా ఇల్లు గుర్తుకు రాలేదు..'' పిల్లలకి చదువు చెబుతూ, మధ్యలో అంది విమల.

''ఎందుకమ్మా? దేవుడు మాకు పిచ్చి నాన్ననిచ్చాడు?'' వున్నట్టుండి అడిగింది పాప.

విమల సమాధానం చెప్పలేక విలవిల్లాడింది.

''కొన్ని ప్రశ్నలకి సమాధానాలుండవు నాన్నా..'' విమల కళ్ళనీళ్ళతో అంది.

''ఏయ్! అమ్మని బాధపెట్టే ప్రశ్నలు అడక్కూడదు..'' బాబు ఆరిందాలా అన్నాడు. ఏడేళ్ళ వయసుని మించిన జ్ఞానం వాడికి అనుభవమే నేర్పింది.

బాబు మాటలకి విమల బాధంతా మరచిపోయి చిరునవ్వు నవ్వింది.

''అమ్మా! ఈరోజు స్కూల్లో ఏమైందో తెలుసా?'' బాబు మెరుస్తున్న కళ్ళతో హుషారుగా అన్నాడు.

''చెప్పు నాన్నా..''

''మధ్యాహ్నం లంచ్ అవర్‌లో, నాకు ప్లేగ్రౌండ్‌లో హండ్రెడ్ రూపీస్ నోట్ దొరికింది. స్కూల్లో అలా ఏమైనా దొరికితే ప్రిన్స్‌పాల్‌కి ఇచ్చెయ్యాలని నువ్వు చెప్పావు కదా..నువ్వు చెప్పినట్టుగానే ఇచ్చేసాను. ప్రిన్స్‌పాల్, టీచర్స్ అందరూ నన్ను గుడ్ బాయ్ అన్నారమ్మా..''

''అవునా? వెరీగుడ్ నాన్నా! మంచి పని చేసావు..'' విమల సంతోషంగా బాబుని దగ్గరకు తీసుకుంది.

''పిల్లలకి కూడా మంచి నడవడి, నీతి నిజాయితీ నేర్పి..ఇప్పుడు నువ్వు కొత్తగా చెడిపోతానంటావేమిటి?'' అంతరాత్మ నిలదీసింది.

విమల నీళ్ళు నమిలింది. సమాధానం కోసం తడుముకుంది.

''అవునూ..అసలు తనెందుకు స్పాయిల్ కావాలి..?'' తనని తానే ప్రశ్నించుకుంది.

మంచితనం, నిజాయితీ కరువవుతున్న ఈరోజుల్లో..తను వాటిని ఇంకా తనలో మిగుల్చుకుంది. పిల్లలకీ నేర్పింది..చక్కని వ్యక్తిత్వాన్ని సంతరించుకుని...దాన్ని పిల్లలకీ పంచి ఇచ్చింది.

''ఇంతా చేసి..ఇప్పుడు కొత్తగా చెడిపోతానంటావేమిటీ?'' అంతరాత్మ తిరిగి ప్రశ్నించింది.

విమల ఉలిక్కిపడింది.

''అవును..అసలు తనెందుకు చెడిపోవాలి?'' తనలో తనే తర్కించుకుంది.

ఎవరో ఏదో చేసారనో..మంచి జీవితం దొరకలేదనో..ఆనందం ఎండమావై పోయిందనో..అందరూ చెడ్డవాళ్ళుగా, రాక్షసులుగా తయారైతే..ఈ ప్రపంచం ఎంత భయంకరంగా వుంటుంది?

ఊహించడానికే భయం వేసింది విమలకి!

ఏ తోటలో పూసినా గులాబీ సొగసైనట్టు..ఏ దీపం వెలిగినా, ఆ కాంతి ప్రకాశవంతంగానే వుంటుంది. అలాంటి దీపాలు అక్కడక్కడైనా వెలగకపోతే-లోకమంతా చీకటితో నిండిపోదూ?

కంటకావృత్తమైన పోరాట మార్గంలో ధైర్యంగా ముందుకు నడుస్తున్న సమయంలో...తన ఆలోచనలు ఒక్క కుదుపుతో ఎటో దూసుకుపోతున్నాయి.

ఎందుకు?

ఎటు చూసినా కర్తవ్యాలు..బాధ్యతలు..మనిషినీ మనసునీ కుంగదీయడం వల్లనేమో! బాధని, బరువుని, కష్టాన్ని, కన్నీటినీ పంచుకునే వారు లేనందుకేమో!

తన భర్త ఒక విచిత్ర జీవి. బాధ్యతల బరువు మోయడంలోని ఆనందంగానీ, భార్యాబిడ్డల అవసరాలు చూడాలన్న బాధ్యతగానీ తెలియని వాడు. అందువల్ల రెట్టింపు బరువు బాధ్యతలు తన నెత్తిన పడ్డమాట వాస్తవమే.

అంతమాత్రాన విరక్తితో పద్ధతి మార్చుకోవాలా? చెడిపోవాలా? అసలా ఆలోచన తనకెలా వచ్చిందో? తను చెడిపోతే, ఇక తన పతిదేవుడికీ-తనకీ తేడా ఏవుంది?

నో..తనిలాగే వుంటుంది..మందాకినిలా స్వచ్ఛంగా సాగిపోతూనే వుంటుంది. ఎన్ని అవాంతరాలెదురైనా, ఎన్ని కష్టాలు అడ్డుకున్నా, నిర్మలంగా ప్రవాహంగానే మిగిలిపోతుంది.

మంచితనం, నిజాయితీ మనిషికో వన్నెనీ, వ్యక్తిత్వాన్నీ, తెలియని అందాన్ని ఇస్తాయి. ''మీ సౌందర్య రహస్యమేమిట'' ని ఇన్నాళ్ళు చాలామంది తనని అడిగారు. ఆ ప్రశ్నకి తను నవ్వి వూరుకునేది. జవాబు ఇప్పుడే తెలిసింది మరి!

స్వచ్ఛమైన మనసు, కల్మషంలేని మాట, తనకునప్పుడు, ఏం లేవని, ఎవరూ లేరని తను బాధపడాలి?

'పుణ్యం కొద్దీ పురుషుడు' అన్నట్టు, 'పాపం కొద్దీ పురుషుడు' అనుకుంటే పోలా? నిజం...''పాపం కొద్దీ పురుషుడు'' అన్న మాట తన విషయంలో నిజమైంది. అయితేనేం..''

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా, ధైర్యమే అండగా..పరిస్థితుల్ని ధీమాగా ఎదుర్కొంటున్న తన జీవితం...

వాట్ ఏ గ్రేస్ ఫుల్ లైఫ్ ఇటీజ్...!

విమల కుర్చీలో వెనక్కి వాలింది. దర్జాగా కాలిమీద కాలు వేసుకొని కూర్చుంది.

''ఒకరి కోసం నా పద్ధతి మార్చుకోడం ఏంటి? నాన్సెన్స్..! నేను నేనే...నేనెప్పటికీ నేనే. మంచితనానికి ప్రతిరూపంలా నిలుస్తాను. పచ్చని ఆకుమీద మంచు బిందువులా మెరుస్తాను. తులసిమొక్కలా పవిత్ర పరిమళాలు వెదజల్లుతాను. మంచి తనమనే దీపంతో, మరిన్ని దీపాలు వెలిగించి..ఈ ప్రపంచాన్ని కాంతివంతం చేస్తాను!'' అనుకుంది.

★

